# చిన్నమనుష్యులు - పెద్దసమస్యలు

పురాణం సూర్యప్రకాశరావు

తను ఈ నలభైఏళ్ళ వయసులోనూ అనేకమైన సంఘటనలు ఇటువంటివి చూశాడు. ఎంతమందో చెప్పగా విన్నాడు. పేపర్లలో చదివాడు. జాలిపడ్డాడు. అప్పుడప్పుడు రెండు కన్నీటిచుక్కలు విడిచిన సందర్భాలుకూడా లేకపోలేదు. అయితే అవన్నీ క్షణికమే అయిపోయాయి. ఎక్కువసేపు హృదయాన్ని అంటిపెట్టుకుని హింసించలేదు. అయితే ఈ ఉదయం జరిగిన ఘోరం మటుకు తన్ని వదిలిపెట్టకుండా ఇంతవరకూ మథిస్తూనే ఉంది. కారణం ఈ చావుతో పరోక్షంగా తనకి ఏమైనా సంబంధం ఉందేమో అనే శంకతో అంతరాత్మ చేసే అల్లరి. తన్ని తాను సమర్థించుకుందుకు చేసే ప్రతి పెద్దప్రయత్నం ఏదో అవ్యక్తమయిన లోటుతో పరాజయం పొందుతూనే ఉంది. ఉదయం తెల్లవారేవరకూ లేని క్షోభ ఆ తర్వాత అనుభవిస్తున్నాడు. నిన్న సాయంత్రం జరిగిందిది:

అప్పటి కింకా చీకటి పడలేదు. వీధి వరండాలో కూచుని బడలికవల్ల బరువెక్కిన శరీరానికి విశ్రాంతి నిస్తున్నాడు తను. లోపల భార్య వంటప్రయత్నంలో ఉన్నది. వీధి గదిలో కొడుకు ప్రకాశం చదువుకుంటున్నాడు. తనూ వార్తాపత్రిక చదువుతున్నాడు. కొద్దిసేపు పోయింతర్వాత "బాబూ!" అన్న కంఠం వినిపించి పేపరు ఒత్తిగించి కళ్లజోడు చివర్నించి అతనివైపు చూశాడు తను. వెంటనే ప్రశ్నించాడు కూడా "ఎవరూ?" అని. ఆ అపరిచిత వ్యక్తి నవ్వుతూ చొరవగా వచ్చి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని "పేపరో మారు ఇస్తారూ?" అని అడిగాడు. మధ్యపేజీలుకొన్ని అతనికిచ్చి తిరిగి తన చదువులో తను మగ్నుడైపోయాడు. మరి కొన్ని నిముషాలు అలా గడిచింతర్వాత పేపరుమడత పెట్టి "దేశంలో పెచ్చు పెరిగిపోతున్న అవినీతీ, లంచగొండితనం గురించీ మీ అభిప్రాయం ఏమిటి?" అని ప్రశ్నించాడతను. మనిషి చూట్టానికి అంత విద్యాధికుడుగా కనిపించకపోయినా ఈ ప్రశ్నించే ధోరణి మటుకు బాహ్యాన్ని బట్టి అంతరంగాన్ని పరీక్షించటం అవివేకం అన్న సత్యాన్ని ఋజువు చేస్తున్నట్టే అనిపించింది. ప్రశాంతమైన ఆ స్వరం వెనక ఎంతో హుందాతనం ప్రస్ఫుటమైంది. నుదుటి మీద ప్రశ్నార్థకంగా ముడతలుపడిన చర్మం, పలకరిస్తున్నట్టుగా కనిపించే అతని చూపులూ ఆ వ్యక్తిపట్ల గౌరవాన్ని ఇవతలి మనిషిలో కలగచేశాయి. "సరిగ్గా మీరు వేసిన ప్రశ్నే నేనూ అనేకమార్లు వేసుకున్నాను. కాని సరయిన సమాధానం నాకు దొరకలేదు." అని సమాధానం చెప్పాడు తను. అసలీ ప్రశ్న తన్ని కొంత కలవరపరిచింది. ఎందుకో తెలియదు.

"నాకు తోచిన సమాధానం చెబుతాను వినండి. నా దృష్టిలో దీనికంతా కారణం ప్రజల్లో నాస్తికత్వం ప్రబలిపోవటం. దేముడుమీద నమ్మకం, పాపభీతీ నశించిపోవటం. అని నే నంటాను. కాదనేవాళ్లు చాలామంది ఉన్నారనుకోండి. అయినా నా అభిప్రాయం మటుకు అదే. శాసనాలూ, చట్టాలూ, పోలీసులూ ఈ ప్రజల్ని పూర్తిగా అదుపాజ్ఞల్లో పెట్టగలవని నేను నమ్మను." అని క్షణం ఆగిపోయాడతను.

"అంటే మీ ఉద్దేశం ఈ ప్రభుత్వాలూ, ఈ అధికారులూ, నిష్ప్రయోజనం అనా?" అని ప్రశ్నించాడు తను.

"అహఁ! అలా అని నే చెప్పటంలేదు. అవి సాధించగలిగేది అసలు సాధించవల్సిన దానిలో కొద్దిమాత్రమే అని నా అభిప్రాయం. దేశంలో లంచగొండితనం విపరీతంగా పెరిగిపోయింది. కూడదని నాయకులూ, అధికారులూ చెవులు చిల్లులుపడేలా ఘోషిస్తున్నారు. ప్రతి ఒక్కడికీ ఆ విషయం తెలుసు. నూటిక్కీ కోటిక్కీ ఆ ఉద్బోధల్ని మెదడుకి పట్టించుకుని ఆచరణలో పెట్టేవాళ్లు అయిదారుగురు ఉండకపోరు. వాళ్లు మార్గదర్శకులేగాని ఆ మార్గాన్ని అనుసరించేవాళ్లే మృగ్యం అంటారు. అట్టడుగు నౌకర్ దగ్గర్నించి పై అధికారివరకూ అంతా చేతులుచాపేవాళ్లే అయినప్పుడు శాసనాలుమటుకు చేసేదేముంది. వీటివల్ల జరిగే ప్రయోజనం కంటె ప్రతివ్యక్తీ తన్ను తాను అదుపులో పెట్టుకోగలిగిన నాడే దేశంలో అవినీతికి స్థానం లేకుండా పోవటం సంభవిస్తుంది. అంటే ఆత్మబలం అవసరమన్నమాట. తనమీద మరో వ్యక్తి చలాయించే అధికారంకంటె తనమీద తనకే అధికారం ఉండేట్టుచేసుకోవాలి. ఇంకా వివరంగా చెప్పాలంటే మనం ఏ దైవభక్తినైతే నిరశిస్తున్నామో, మూర్ఖం అనుకుంటున్నామో, ఆ భక్తి, ఆ నమ్మకం ప్రతివ్యక్తికీ ఉండితీరాలని నా అభిప్రాయం. తప్పుచేస్తే తన్ని మరో అజ్ఞాతశక్తి శిక్షిస్తుందేమో అనే పాపభీతి ఉన్నప్పుడే ఆ తప్పు చెయ్యకుండా ఉండటం సాధ్యంఅవుతుంది. మీరేమంటారు?"

"అనటానికేముంది లెండి. మీరుచెప్పింది కొంతవరకూ నిజం అని ఒప్పుకుంటాను" అన్నాడతను.

"అంటే పూర్తిగా ఏకీభవించరన్నమాట. మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి వింటాను" అన్నాడతను.

"ఈ నవనాగరిక ప్రపంచంలో బ్రతుకుతూ కూడా ఇంకా పాతకాలపు మూఢ నమ్మకాలు పట్టుకుని కూచోనుంటే ఎవళ్లు ఇష్టపడతారు. ఈ రోజుల్లో ఎవడికి వాడే దేముడు.

"మీరు నా అభిప్రాయం సరిగ్గా అర్థం చేసుకోలేదని ఇప్పుడు మీ రన్నమాటలే ఋజువు చేస్తున్నాయి. ఇంకా వివరంగా చెప్పటానికి ప్రయత్నిస్తాను. ఈ భూమ్మీద ఎంతమంది బిచ్చగాళ్లున్నారు? వాళ్ళకి నిత్యం దానధర్మాలు చేసేవాళ్లు కొంతమంది ఉంటారని మీరు ఒప్పుకుంటారా?" అని ప్రశ్నించాడతను.

"ఇందులో ఒప్పుకోకపోవటానికేముంది. దానం చేసేవాళ్ళు ఉండబట్టే వాళ్ళూ అడుక్కుంటున్నారు." అని సమాధానం చెప్పాడు తను.

"అయితే వాళ్లెందుకు దానం చేస్తున్నారు?" - ఇది రెండో ప్రశ్న.

"మీరు మరీ సిల్లీగా అడుగుతున్నారు. ఎందుకేమిటండీ 'వాళ్ల దీనావస్థకి జాలిపడి సహాయం చేస్తున్నారన్నమాట."

"ఎందుకు జాలిపట్టం? దానివల్ల తమ కేమిటి ప్రయోజనం?"

ఈ ధోరణి తనకి విసుగ్గా ఉన్నమాట నిజం. "ఎందు కేమిటండీ?" అయ్యో పాపం వాడు కష్టదశలో ఉన్నాడు. ఓ కానీ వేద్దాం' అని సహజంగా అనిపిస్తుంది *

"అల! ఇప్పుడు నే చెప్పబోయేది వినండి. మీ అంతస్సులో అజ్ఞాతంగా అటువంటి శక్తి పని చేస్తూంటుం దని ఒప్పుకుంటారా?"

తను తల ఒప్పుకున్నా నన్నట్టుగా ఊపాడు.

"కొంతమందిలో ఆశక్తి తక్కువ ప్రభావం కలిగిఉంటుంది. మరికొందరిలో ఎక్కువప్రభావం కలిగిఉంటుంది. అసలు లేకపోవటమంటూ ఉండదు. ఈ నలభైఏళ్ల జీవితంలో ఎన్నడూ ఎవరిగురించీ జాలిపడ్డ సందర్భం లేదని మీరు చెప్పగలరా?"

"ఎలా చెప్పగలను? అనేకమార్లు కన్నీరు కూడా కార్చాను"

"అయితే నే చెప్పిన అజ్ఞాతమైనశక్తి మీ చేత అప్పుడప్పుడు స్వార్థత్యాగం కూడా చేయించ గలిగే శక్తి గలదని నమ్మగలరా?"

"ఒప్పుకుంటాను"

"ఆశక్తినే దేముడందాం. పోయే దేముంది? ఆశక్తినే ఆరాధిద్దాం. పూజిద్దాం గౌరవిద్దాం. ఆశక్తిని ఇంకా పెంపొందించు కుని రాక్షసప్రవృత్తుల్ని సాధ్యమైనంత వరకూ జయిద్దాం మనకు చేతనైనంతవరకూ ఈ ప్రపంచంలో మంచిచేసేద్దాం. అలా చెయ్యగలిగే శక్తి అప్పుడే కలుగుతుంది. ఏమంటారు?"

తను నిర్విణ్ణ బోయి వింటున్నాడు. "మీ అభిప్రాయాలు బాగానే ఉన్నాయి. ఇంతకీ మీ పేరు చెప్పారు కారు" అని అడిగాడు తను.

"నా పేరు గోపాలరావు. ఏంపని చేస్తున్నావని అడక్కండి. అదంతా పెద్ద గొడవ." అన్నాడతను ఆ గొడవ ఏమిటో తరిచితరిచి అడగ దల్చుకోలేదు తను.

ఇవాళ మిమ్మల్ని కలుసుకోవటం నాకు చాలా సంతోషాన్ని కలుగజేసింది." అని అభినందించాడు తను. తర్వాత అతనడిగిన ప్రశ్నకు తనకు ఒక్కడే కొడుకనీ అంతకు తప్పించి ఎక్కువమంది లేకపోవటంకూడా ఒక అదృష్టమేననీ సమాధానం చెప్పాడు.

"ఈ ఇల్లు మీ సొంతమేనాండి?" అని అని అడిగాడతను.

"అవునండి ఈ మధ్యనే కట్టించాను. రెండుసంవత్సరాలయింది."

"ఈ ఇల్లు చాలా అందంగాఉంది. పెట్టుబడి చాలా అయుంటుంది"

"అబ్బో! ముప్ఫైవేలు దాటిపోయింది ఖర్చు. అయినా ఇటువంటి పట్నవాసాల్లో ఓ యిల్లు ఉండటం చాలా అవసరం అని కట్టించాను."

"మంచిపని చేశారు"

ఇంతలో వసారాలో లైటువెలిగింది. లైటుచీకటి అప్పుడప్పుడు పడుతోంది. దీపం వెలగ్గానే కళ్లుమూసుకుని నమస్కారం చేసి ఏదో అస్పష్టంగా ఉచ్చరించాడు గోపాలరావు. ఈ చర్యవింతంగానే తోచింది తనకి.

మరి కొద్దిసేపు పోయింతర్వాత గోపాలరావు తిరిగి "మీరు సహాయంచేసి పెడతారా అన్నాడు.

"ఏమిటండి?"

"నిన్న ఉదయం అనగా భోజనంచేశాను. ఇంతవరకూ మంచినీళ్లు తాగి ఉండగలిగాను ఆకలి దహించుకపోతోంది. ఓరూపాయి ఇప్పిస్తారూ, ఈ రాత్రికీ రేపురాత్రికీ భోజనానికి తడుముకోవాల్సిన అవసరం ఉండదు.

నోటమాట పెగల్లేదు తనకి. అయితే ఈ ఉపోద్ఘాతమంతా ఇందుకన్నమాట! అడుక్కోవటంలో ఘరానా పద్ధతి!.అంతవరకూ అతనిమీద ఉన్న గౌరవం ఆ క్షణంలో జుగుప్సా అసహ్యంగానూ మారిపోయింది. అతనంటే ఓవిధమైన తేలిక దృష్టి ఏర్పడిపోయింది. "నువ్వు ముందుగానే ఈ ప్రస్తావన తెచ్చిఉంటే తప్పకుండా సహాయం చేసేవాడ్ని. అయితే నాటకమాడి ఘరానాగా బుట్టలో వేసుకుందామనుకుంటే లొంగేవాడ్ని కాను. ఒక్క దమ్మిడీ నీకు నేను సహాయం చెయ్యను. ఇంకా ఏదో చదువుకున్నవాడివనీ, పెద్దమనిషివనీ అనుకున్నాను. అసలు రంగు బయటపడింది." అంటూ ఎగిరిపడ్డాడు తను.

గదిలో చదువుకుంటున్న ప్రకాశం గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు. వాడివైపూ, తనవైపూ దీనంగా ఓమారు చూసి గోపాలరావు లేచి వెళ్లిపోయాడు. అయినా చాలా సేపటివరకూ తన ఆవేశం చల్లారలేదు. నేరుగా వచ్చి కుర్చీలోకూడా చతికిలబడ్డాడు! చేతిలో పేపరు తీసుకున్నాడు! పెద్దపెద్ద విషయాలు చర్చించాడు! అంతా బూటకం! నటన! ఇదేదో వింతగా నలుగురి చెవినీ వెయ్యాలనీ, వాళ్ళూ అతన్ని అసహ్యించుకోవాలనీ అనిపించి దగ్గర్లో గుమ్మంలో నిలబడ్డ కొడుకు నుద్దేశించి నవ్వుతూ "చూశావుట్రా! ప్రపంచం అంటే ఎలాగుందో గ్రహించు. అంతా మోసం! కబుర్లు చెప్పి నన్ను మోసంచేద్దా మనుకున్నాడు. నేనా లొంగేది" అన్నాడు. అయితే తనూహించినట్టుగా ఎదుటిమనిషి తనకి తాళం వెయ్యకపోవటంతో అవమానం జరిగినట్టుగా బాధపడ్డాడు తను.

"అందులో మోసం ఏముంది? అతను మాటిగానే అడిగాడు. అతను చెప్పిన విషయాలు ఒకళ్లని మోసగించేవి ఎంతమాత్రం కావు. వాటినుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది. ఆయన అభిప్రాయాల్లో ఏకీభవించినట్టు నువ్వన్న మాటలూ విన్నాను. నిన్ను నువ్వే మోస



క్రిందపడి కాళ్లూ చేతులూ బెణికితే


అమ్మ అమృతాంజనం వాడింది


వెంటనే తగ్గిపోయింది!

అమృతాంజనము




అన్ని నొప్పులు జలుబులు, దగ్గులు మొదలైన వాటికి కూడా అమృతాంజనమే వాడండి.

# ★ చిన్న మనుష్యులు - పెద్దమనుష్యులు ★

గించుకుంటున్నావు. అతను అర్థించిన సహాయం నువ్వు తిరస్కరించావు. నీ అసలు రంగు బయటపడింది." అన్నాడు కొడుకు.

తన వొళ్ళంతా తేళ్లూ జెర్రులూ ప్రాకి నట్టయింది. కొడుకు తన అభిప్రాయాలతో ఏకీభవించకపోవటం ఇవాళేమీ కొత్త కాదు. కారణం తనకి తెలుసు. తనకున్న ముందు ఆలోచనా, దూరదృష్టి కొడుక్కి లేకపోవటంతో తను చేసే పన్లన్నీ వాడికి తప్పుగానే కనబడుతున్నాయి. ఇంతలా తను శ్రమిస్తున్నాడంటే అదంతా ఎవరి కోసం? వాడికోసం కాదూ? ఆ జ్ఞానం వాడికుందా? తను కొంతమందికి ఉపకారం చేసి తద్వారా కొంతడబ్బు సంపాదిస్తున్న మాట నిజమే. అయితే అది ఇచ్చేవాళ్లూ పుచ్చుకునే తనూ కూడా బహుమానంగా భావిస్తుంటే వీడు దానికి 'లంచం' అని పెద్ద పేరు పెట్టి తన్ని అసహ్యించుకుంటున్నాడు. ఆ విషయంలోనే వాడికీ తనకీ పేచీ వచ్చేది. భార్య ఎటువైపూ వాదించటం చేతకాక ఊరుకుంటుంది. "ఏదీ కాదు. ఆ పథక నాయకుడు అంతా ఏదో మహా గొప్పగా నీకు కనిపించింది కాబోలు. నేను మటుకు వాటితో ఏకీభవించలేను. ఏదో సత్కీర్తి కోసమన్నట్టుగా తల ఊపాను. అది నిజమని నమ్మావంటే మోసపోగలవు. జాగ్రత్త!" అన్నాడు తను; అంతకు మించి కఠినమైన పదాలు వాడటం ఇష్టం లేక. వాటి పర్యవసానం తనకీ కొడుక్కీ మధ్య చిన్న గాలి దుమారం లేవటమే.

కొడుకు హేళనగా చులకనగా నవ్వేశాడు. ఆ నవ్వు తన గుండెల్లో నాటుకుని చాలా బాధ పెట్టింది. "నువ్వు నాకి మోసాన్ని సమర్థిస్తున్నావు" అన్నాడు తీవ్రంగా తను.

"లేదు. అతని అభిప్రాయాన్ని సమర్థిస్తున్నాను. అతని దైన్యానికి జాలిపడుతున్నాను. కాని నేనేవిధంగా అతన్ని సంతృప్తిపర్చగలను. నాదగ్గరేముంది ఇవ్వటానికి?" అన్నాడు కొడుకు ఏదో బాధపడుతున్నట్టుగా.

చేతిలో పేపరు కిందకేసి విసిరికొట్టి లోపలికి వెళ్ళిపోయాడు. వంటింట[illegible] భార్య పొయ్యిముందు కూచునివుంది. భ[illegible]



లేపాక్షి దేవాలయ కుడ్యచిత్రం —ఫొటో: పి. గురుమూర్తి.

లోకి చూసి "ఇవాళ వంట ఆలస్యం అయిందండీ" అంది.

తను గుమ్మంలో కూచుని "చిన్నవాడు కదా అని ఊరుకుంటే రోజు రోజుకీ వీడి ధోరణి విపరీతంగా మారుతోంది. వీడి పాటి తెలివితేటలు నాకు లేవని కాబోలు వీడి ఉద్దేశం" అంటూ గొణగటం ప్రారంభించాడు.

"ఏవిటండీ! ఏమయింది?" అంది భార్య నుదుట చెమట ఒత్తుకుంటూను.

"ఏవిటయేది? నీ కొడుకు ప్రతాపం గురించి చెబుతున్నాను."

"ఏమంటాడు?" భార్య ఇవతలికి వచ్చి భర్త ముందుగావచ్చి నిలబడింది.

"నే నేదో శుద్ధ మూర్ఖుడిన్నీ, అవినీతి పరుడిన్నీ అయినట్టుగా చులకనగా మాట్లాడుతాడు. వాడితో మాటలు కదపటం అంటే అసహ్యం పుడుతూంటే. వీడి తాహతేవిటి? నా తాహతేవిటి? నన్ను వీడు విమర్శిస్తాడా?" ఈ స్వరం చాలా ఉద్రేకపూరితంగా ఉన్నా వీధి గదిలో చదువుకుంటున్న కొడుకు చెవిని పడదని తనకి తెలుసు. అందుకే మరింత గట్టిగా భార్యముందు ఎగిరిపడ్డాడు.

"నే చెబుతానులెండి. కుర్రకుంక వాడికేం తెలుసు. పెద్దవాడైతే కష్టసుఖాలు అనుభవంలోకివస్తే అప్పుడు తెలుస్తుంది. అంతవరకూ ఇలాగే ఉంటారు." అని సర్ది చెప్పింది భార్య.

కొడుకు తన్ని ఎంతగా ప్రతిఘటించినా తనేమీ చెయ్యలేడన్న సంగతి తనకి తెలిసినా భార్యముందు మటుకు వాడి సంగతి అటో ఇటో తేలిపోవాలి అన్నట్టుగా విరుచుకుపడుతూంటాడు. "ఆ కట్టె పిచ్చివేషాలు వేస్తే రేపట్నుంచీ వాడికీ నాకూ సంబంధం లేదు. ఈ చదువు ఇంతటితో ఆపేస్తాను." అని భార్యతో అంటూంటే కొడుకు విని టేబిలుమీద పుస్తకాలూ, బీరువాలో పుస్తకాలూ అన్నీ విసిరి వరండాలో పారేసి ఇక ఇంటిముఖం చూడనంటూ చరచరా వీధిలోకి నడవబోయాడు కొడుకు. తల్లి అడ్డుపడింది. ఆగిపోయాడు. నవ్వుతూ వెనక్కి తిరిగివచ్చాడు. నిజంగా పోతాడేమో మళ్ళీ తిరిగిరాడేమో అని తనూకంగారు పడ్డమాట నిజం. అయితే పైకిమటుకు నిర్లక్ష్యంగా, నిర్లిప్తతగా, ఉన్నట్టు నటించాడు. లేకుంటే తను మరీ లోకువైపోడూ!

"మనం సంపాదించింది చాలు. కొన్ని తరాలు సుఖంగా జీవించవచ్చు. ఇంకా ప్రజల్ని పీడించి లంచాలు పుచ్చుకోవటం మానెయ్యి. ఇప్పటికే పదిమందిలోనూ చెడ్డపేరు వచ్చింది. తలెత్తుకు తిరగలేకుండా ఉన్నాను." అంటాడు కొడుకు.

దానికి సమాధానం పళ్లు పటపటా కొరుక్కుని అక్కడ్నించి నిష్క్రమించటం. ఇలా ప్రతినిత్యం ఎప్పుడో ఒకప్పుడూ వాడికీ తనకీ ఈ ఘర్షణ తప్పటంలేదు. ఒకళ్ల అభిప్రాయాలు ఒకళ్ళకి గిట్టవు.

* * *

ఆ మొర్నాడు ఉదయం ఇంకా తెల్లవారకుండానే దూరంగా ఏవేవో అరుపులూ, గోలా, వినిపించి పక్కమీద లేచి కూర్చున్నాడు. అప్పటికే కొడుకు లేచి బైటికి వెళ్ళాడు. బహుశ ఆ గోల జరిగే వైపుకే వెళ్ళిఉంటాడు. భార్య గుమ్మం ముందు నిలబడి ఉంది. భర్తని చూసి "ఎవరో రైలు కిందపడ్డారుట. పాపం! లెవిల్ క్రాసింగ్ గేటుదగ్గర పడ్డాట్ట." అని చెప్పింది. మీద తువ్వాలు వేసుకుని భార్య అడ్డుపడినా వినిపించుకోకుండా అటువైపుకి పరుగుతీశాడు తను.

గేటువద్ద వందలాదిగా జనం గుంపులు గూడారు. తోసుకుంటూ ముందుకు వెళ్ళాడు. ఆ దృశ్యం చూసి కళ్లుతిరిగి నేలమీద చతికిలబడిపోయాడు. ఒళ్లుతిరిగింది. తిరిగి తనకి స్పృహవచ్చేసరికి ఇంట్లో మంచంమీద పడుకుని ఉన్నాడు.

భార్య ఎదురుగ్గా కూర్చుని కన్నీరు కారుస్తోంది. కొద్దిదూరంలో కొడుకు కూర్చుని ఉన్నాడు. కిటికీలోంచి ఉదయపు ఎండ తన పాదాలమీద పడుతోంది. ఉండి ఉండి చల్లటిగాలి ఓ విసురు విసురుతోంది.

"ఎలాగుంది ఇప్పుడు?" భార్య ప్రశ్నించింది. కొడుకు ఆతృతగా ముందుకు వంగాడు.

"బాగానే ఉంది" అంటూ లేచి కూర్చున్నాడు మంచంమీద.

"అందుకే మిమ్మల్ని వెళ్ళవద్దని అడ్డుపడ్డాను. నామాట వింటేనా" అని గొణుక్కుంది భార్య. కొడుకుమటుకు ఏమీ మాట్లాడలేదు. వాడి దృష్టి చేతిలో పుస్తకం మీదే లగ్నం అయిఉంది. గేటు దగ్గర చూసిన ఘోరం తన కళ్ళముందు ఇంకా మెదులుతూనే ఉంది. 'గోపాలరావు!' ఆ పేరు ఇంకా తన చెవులో మార్మ్రోగుతూనే ఉంది. అతను చెప్పిన విషయాలు అప్పుడు వింటున్నట్టే అనిపిస్తోంది. అతని చామన చాయముఖం ఇంకా కనిపిస్తోంది. ఇంతలో ఇలా జరిగిపోతుందని ఊహించాడా? ఆత్మహత్య! కొడుకు కుర్చీలో కూర్చునే ఓరగా తనవైపు చూశాడు. సిగ్గుతో తన తల వంగిపోయింది. మళ్ళీ అనుకున్నాడు. అతను ఆత్మహత్య చేసుకుంటే మధ్య తన కెందుకీ బాధ! తప్పు చేసినట్టుగా వాడిముందు ప్రవర్తిస్తే వాడు తన్ని మరింత ఆడిస్తాడు. వంచిన తల ప్రయత్నించి నిలబెట్టాడు తను.

భార్య లేచి అక్కడ్నించి వెళ్ళిపోయింది.

కొడుకు చిన్నగా నవ్వి "ఈ ప్రపంచంలో ఒకరికోసం మరొకరు ఎంతో కొంత త్యాగం చెయ్యగలిగితేగాని జీవితాలు ఒక మోస్తరుగా అన్నా గడవ్వు. ఈ భూమ్మీద ప్రతిఒక్కడూ బ్రతికే హక్కు కలిగిఉన్నాడు. ఈ హక్కుకి భంగం కలిగించే సంఘటనలు ఏది జరిగినా దాన్ని తీవ్రంగా ప్రతిఘటించే హక్కుకూడా ప్రతివాడికీఉంది. అయితే ఆ హక్కుని గుర్తించకలిగే సంస్కారంకూడా లేని చాలామంది అభాగ్యులు ఇలాగే అంతమయిపోతున్నారు. మనం అంతా అందుకు సిగ్గుపడాలి. మనలో ప్రతిఒక్కడూ గోపాలరావు చావుకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బాధ్యులమే. బెదిరి మూర్ఛపోవటం కాదు. కనీసం రెండు కన్నీటి చుక్కలైనా అతన్నిగురించి విడవండి" అంటూ కొడుకు పుస్తకంమూసి వీధిలోకి నడిచాడు.

కాఫీగ్లాసుతో భార్య గదిలో ప్రవేశించింది. కొడుకుమాటలే చెవులో ప్రతిధ్వనిస్తున్నాయి. "దేశంలో బిచ్చగాళ్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఎంతమందికని దానం చెయ్యగలం?" అంది భార్య.

"అవును ఎంతమందికని దానంచెయ్యగలం?" అదే ప్రశ్నని మళ్లీ మళ్లీ రెట్టించుకున్నాడు మనసులో. ప్రతి ఉదయం పిడికెడు బియ్యం తను స్వయంగా బిచ్చగాడికి వేస్తున్నాడు. అది ధర్మం కాదూ? ఈ

(34-వ పేజీ చూడండి)


రవి టాయిలెట్స్

అందముకు,
వర్ఛస్సుకు




సోల్ ఏజంట్లు:—
వి న్యూ స్టార్ & కో., మద్రాసు-21.

కేశ వృద్ధికిని, అకాల నెరియను ఆపుటకు
కాశ్మీర్ - కుసుమం
మీ ఇష్టమైన నూనెలో నాన్పండి
యునైటెడ్ కెమికల్స్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.
నిరపాయకరమైన
నంజనగూడు పండ్లపొడి
ఇతర 54 ఔషధముల జాబితా ఉచితము

# ★ చిన్నమనుష్యులు - పెద్దసమస్యలు ★

(21-వ పేజీ తరువాయి)

చావుకి తను బాధ్యుడని కొడుకు ఉద్దేశం అయియుంటుంది.

మెల్లగా మంచం దిగి వీధి గేటు దగ్గరకు వెళ్ళి రోడ్డువైపు చూశాడు తను. రోడ్డుమీద నడిచే ప్రతీ ఒక్కరూ ఈ ఉదంతంగురించే మాట్లాడుకుంటున్నారు, రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. భార్యనడిగి చేతికర్ర తీసుకుని అలా సందుమొగదాకా నడిచాడు. అక్కడో పదిమంది గుంపుగా చేరి ఈ విషయమే మాట్లాడుకుంటున్నారు. ఒకళ్లు వేసిన ప్రశ్నకి సమాధానంగా మరొకడు "ఆకలి చావండీ! తిండిలేక ఆకలిబాధ భరించలేక ఈపని చేస్తున్నానని రాసిపెట్టి మరీ చనిపోయాడు. పేరు గోపాలరావుట!" అని చెప్పాడు.

"ఆకలిచావు!" చెవులు గింగురుమన్నాయి తనకి. చరచరా వెనక్కి తిరిగి ఇంటికి వచ్చేశాడు. అయితే రెండురోజుల్నించీ తిండిలేదని అతను చెప్పింది నిజమే అన్నమాట. కొడుకు చెప్పిన నీతులు చెవుల్లో మార్మోగుతున్నాయి! అవును నిజం! తనూ ఈ చావుకి కొంతబాధ్యుడే! కళ్లు చెమ్మగిల్లాయి. ఎదురుకుండా భార్యొస్తుంటే కన్నీరు ఆమె గమనిస్తుందేమోఅని ముఖం తిప్పుకుని పడగ్గదిలోకి వెళ్లిపోయాడు ఎంత అరికట్టుదామని ప్రయత్నించినా ఆలోచనా ప్రవాహం ఆగటంలేదు. గదిలో అటూ ఇటూ అలంగం తిరిగాడు. గాలికి కిటికీ రెక్కలు టపటపా కొట్టుకొంటుంటే తన హృదయంమీద ఎవరో బలంగా మొత్తుతున్నట్టుగా ఫీలవుతున్నాడు గబగబావెళ్లి కిటికీ రెక్కలు మూసేశాడు. కిటికీ పైభాగంనించిచూస్తే దూరంగా 'లెవెల్ క్రాసింగ్ గేట్' కనిపిస్తోంది. జనంమటుగలేరు. తునాతునలై మొండానికి మొండెం, తలకి తలా చెల్లాచెదరై విసిరిపారేసినట్టుగా దూరదూరంగా పడి నెత్తురులో తడిసిన ఆ ఖండాలు కంటిముందు తిరుగుతున్నాయి. "ఓరూపాయి ఉంటే ఇస్తారూ నిన్న ఉదయం అనగా భోంచేశాను." అని గోపాలరావు దీనంగా వేడుకుంటున్నాడు! ఈ చావుకి నువ్వే బాధ్యుడివి అంటున్నాడు కొడుకు! మనసులో ఈ మాటలు గిరగిరా తిరిగిపోతున్నాయి. కడుపంతా రెండుచేతుల్తోనూ దేవినట్టుగా బాధపడుతున్నాడు తను.

భార్య వచ్చి అన్నానికి లేవమంది. "ఆకలి లేదు." అందామనుకున్నాడు గాని ఎందుకని భార్య ప్రశ్నిస్తే ఏమని జవాబు చెప్పగలడు? ఆమె నేవిధంగా సంతృప్తి పరచగలడు? కంచం ముందుకు వెళ్ళి కూర్చున్నాడు. కొడుకు అప్పటికే భోజనం చాలా వరకూ పూర్తిచేశాడు. తనూ నాలుగు మెతుకులు కతికి అయిందీ అనిపించాడు. కడుపు నిండుగాఉంది. నేరుగా మళ్ళీ గదిలోకి వెళ్లిపోయాడు.

సాయంత్రం వరకూ ఇవే ఆలోచనలు! టేబిల్ మీద పత్రిక తిరగవేసి కథ చదవటం మొదలు పెట్టారు. మనశ్శాంతికోసం పుస్తకం తెరుస్తే ఆ కథలో ప్రయోజనం తనమీదే దాడిచేసింది. పుస్తకం మూసేశాడు చిరాగ్గా. ఈ చావుకీ తనకీ ఏమాత్రం సంబంధంలేదని ఎంత సమర్థించుకుందామన్నా ఉండీ ఉండీ ఆ భీభత్స దృశ్యాలు కంటిముందు మెదిలి మనసంతా పాడుచేస్తున్నాయి. వాటిన్నించి తప్పించుకోవటం సాధ్యం కాకుండాఉంది. చల్లగాలికోసం వీధి వరండాలో పడకకుర్చీ వేయించుకుని కూర్చున్నాడు. ఇంకా చీకటి పడలేదు. పక్కనేఉన్న కుర్చీవైపు చూశాడు. ఆ కుర్చీలో గోపాలరావు కూర్చున్నట్టే మాట్లాడుతున్నట్టే అనిపించి కళ్లు గట్టిగా మూసేసాడు. ఈ వేళకే నిన్న అతనూ తనూ ఇక్కడ సమావేశమయారు. ఈ ఉదయం అతను చనిపోయాడు. ఎటువంటి చావు? ఆ...త్మ...హ...త్య!" వెనక్కి చారబడి కళ్లుమూసుకుని ఏ ఆలోచనా లేకుండా గడపాలని ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. పెరట్లో ఉన్న భార్యని రమ్మని ఏదైనా మంచి పుస్తకం చదివి వినిపించమన్నాడు. అతని కిష్టమైన పిల్లలకథలు చదివి వినిపించింది భార్య. కొద్దిసేపు పోయింతర్వాత "మీరు వినటం లేదు" అంది ఆమె.

"ఆఁ! ఆఁ!" అంటూ నాన్చేశాడు తను.

"బాబూ! ఓ కాని ధర్మం చెయ్యండి బాబూ!" ఈ కంఠం విని తలెత్తిచూశాడు. బిచ్చగాడు! వాడ్ని చూడగానే మెరుపు మెరిసినట్టుగా ఓ ఆలోచన పుట్టుకొచ్చింది. వాడ్ని లోపలికి రమ్మని పిలిచాడు. వచ్చిం తర్వాత "నువ్వన్నాళ్లయింది భోంచేసి?" అని ప్రశ్నించాడు.

"నిన్న ఉదయం అనగా తిన్నాను బాబూ! ఇంతవరకూ జోలిలో ఒక్క గింజ కూడా రాలలేదు. కడుపు మండిపోతోంది." అన్నాడు ముసలి గొంతుతో. ఆ కంఠం వింటుంటే ఏదో ఉప్పెనలా ఆవేశం ముంచుకొచ్చింది. భార్యవైపు తిరిగి "వాడికి కడుపునిండా అన్నం పెట్టు" అన్నాడు వీధిగదిలో కొడుక్కి వినిపించేలా. భార్య లేచివెళ్ళి విస్తరాకునిండా అన్నం పెట్టి తీసుకొచ్చి బిచ్చగాడికి పెట్టింది. వాడు కడుపునిండా భోజనంచేసి తృప్తిగా త్రేన్చి, నవ్వుతూ "మీ మేలు ఈజన్మలో మర్చిపోలేను దొరా" అంటూ వెళ్ళబోతుంటే 'ఈ రూపాయి తీసుకో' అని జేబులోంచి రూపాయితీసి వాడి చేతిలో పడేశాడు. బిచ్చగాడు నివ్వెరపోయి తనవైపు చూశాడు. ముఖంలో ఏ భావమూ లేదు. బహుశ వాడి జీవితంలో ఇటువంటి రోజు చూసిఉండడు. బిచ్చగాడి ముఖంలో గోపాలరావు ముఖం లీలగా గోచరించింది. వాడు చాపిన చేతులు గోపాలరావు చేతుల్లాగా కనిపిస్తున్నాయి. అంతా భ్రాంతి! కాని... కాని...వీడూ అలాగే ఎప్పుడో ఒకప్పుడు రైలుక్రింద..." ఆపైన ఊహించలేకపోయాడు.

బిచ్చగాడు దీవనలు దీవిస్తూ వెళ్ళిపోయాడు. తను కొడుకు గది గుమ్మంవైపు చూశాడు. తను ఆశించినట్టుగా కొడుకు అక్కడ కనిపించలేదు. కొంత నిరాశపడ్డా తను చేసిన ధర్మం కొడుక్కి తెలియకుండా ఉంటుందా అని ఆశగా అనుకున్నాడు తను. ఆ రాత్రి కడుపునిండా అన్నం తినాలనిపించింది. విస్తరిముందు కూర్చుని భోజనం చేస్తున్నంతసేపూ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాని నోరు మెదపలేకపోతున్నాడు. చివరికి లేచిపోబోతుంటే కొడుకే అన్నాడు. "ఈ సాయంత్రం మీరు చేసిన మంచిపని నన్ను చాలా సంతోషపరిచింది. చాలా గర్వించాను కూడా" అని.

ఈ ప్రశంసతో గాలికొట్టిన బంతిలా అయిపోయాడు తను. ముఖం ఆనందంతో వికసించింది నవ్వుతూ జవాబు చెప్పాడు. "నాకూ చాలా తృప్తిగా ఉంది." అని.

తండ్రీ కొడుకూ ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని హృదయం విప్పి నవ్వుకున్నారు.

కొడుకు భుజంమీద చెయ్యివేసి "రేపట్నించి సెలవు పెట్టేస్తున్నాను. ఆతర్వాత 'రిటైర్' అయిపోతాను. నీ కిష్టమేనా?"

"చాలా సంతోషం! అలాగే సెలవు పెట్టండి" అన్నాడు కొడుకు. భార్యవింతగా ఇద్దరు ముఖాలూ చూస్తూ నిలబడింది.

"మరోపనికూడా చెయ్యాలనుకుంటున్నాను. ప్రతిరోజూ ఓ బిచ్చగాడికి కడుపునిండా అన్నం పెడదామనుకుంటున్నాను." - నోరు ఆవులించి తండ్రివైపు వింతగా చూస్తూండిపోయాడు కొడుకు. అతని కళ్లనించి రెండు కన్నీటి చుక్కలు చెంపలమీదుగా జారి విస్తరాకు మీద పడ్డాయి.

"తను తిని ఇంకొకరికి పెట్టగలిగిన శక్తిగల ప్రతివాడూ ఓ పూట ఒక పేదవాడికి అన్నం పెట్టకూడదూ?" - కొడుకు తడిసిన కంటిరెప్పల్ని తుడుచుకుంటూ లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ పెరటివైపుకి నడిచారు. ★